క్లుప్తంగా

ఆర్థికసాయం



పర్వతగిరి: మండలంలోని రోళ్లకల్ సాధ్యతండాకు చెందిన మూడు భాస్కర్ శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందాడు. గ్రామ యూత్ సభ్యులు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి అంత్యక్రియలకు రూ.8వేలు ఆర్థిక సాయం అందజేశారు. పరామర్శించిన వారిలో యూత్ అధ్యక్షుడు ప్రతాప్, సలహాదారు బాలకృష్ణ, కార్యదర్శి విజయ్, మాజీ సర్పంచ్ వెంకన్న, మంగయ, అనిల్, శ్రీను, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ తనిఖీ



దుగ్గొండి: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ ప్రకాష్ శుక్రవారం తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని రికార్డులను పరిశీలించారు. అనంతరం సిబ్బందితో సమీక్షించారు. నెలవారి డెలివరీల వివరాలు, కేసీఆర్ కిట్ల పంపిణీ, చిన్నారులు, గర్భిణీలకు వాక్సినేషన్‌పై అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి కిరణ్‌రాజు, హెచ్‌ఈఓ సాంబయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ నుంచి బీఆర్‌ఎస్‌లో చేరిక



సంగెం: మండలంలోని నార్లవాయి గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో శుక్రవారం చేరారు. సింగిరెడ్డి అనిల్, రాజు, సంజీవ, అశోక్, మొగిలి హరిశంకర్, సింగిరెడ్డి శ్రీనివాస్, ఎల్లగ్గార్ యాకయ్య, మొల్గూరి మల్లయ్య, రాజు, మొగిళి, శ్రీనివాస్, చల్లా వీరస్వామి, దామెర సుదర్శన్, దండుగుల కొమ్ములు తదితరులను పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ విధానాలు నచ్చకనే బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారన్నారు.

యువజన కాంగ్రెస్ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా ఎల్లాగౌడ్



ఖానాపురం: యువజన కాంగ్రెస్ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా మండలంలోని బుధరావుపేటకు చెందిన మోడెం ఎల్లాగౌడ్‌ను నియమించారు. శుక్రవారం ఎమ్మెల్యే అభ్యర్థి దొంతి మాధవరెడ్డి చేతుల మీదుగా నియామకపత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఎల్లగౌడ్ మాట్లాడుతూ పార్టీ కోసం, ఎమ్మెల్యే అభ్యర్థి గెలుపు కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. తన ఎన్నికకు సహకరించిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శిగా సునీల్

ఎస్సీ సెల్ మండల ప్రధాన కార్యదర్శిగా బత్తిని సునీల్‌ను నియమించినట్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం నియామక పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ ఆయుర్వేద దినోత్సవం



కాశిబుగ్గ: జాతీయ ఆయుర్వేద దినోత్సవం, ధన్వంతరి జయంతిని పురస్కరించుకుని అనంతలక్ష్మి ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాల, బోధన వైద్యశాలలో వేర్వేరుగా ఆయుర్వేద దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఆయుర్వేద వైద్య కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్‌కుమార్, బోధన వైద్యశాలలో సూపరింటెండెంట్ డాక్టర్ జగన్మోనాచారి ఆధ్వర్యంలో ధన్వంతరి విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆయుర్వేదం అనేది పురాతన భారతీయ వైద్య విధానం అని వివరించారు. అనేక దీర్ఘకాలిక వ్యాధులు ఆయుర్వేదంతో పూర్తిగా నయం చేయవచ్చని చెప్పారు. కార్యక్రమంలో ఆస్పత్రి డెవలప్‌మెంట్ కమిటీ సభ్యుడు డాక్టర్ సాంబమూర్తి, మాజీ సూపరింటెండెంట్ డాక్టర్ రమేష్, ప్రొఫెసర్లు, వైద్యులు, పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ఎస్‌వీఎస్ చారి

వర్ధన్నపేట: విద్యతోనే జ్ఞానం వస్తుందని విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలకు ఎదగాలని జనగామ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌వీఎస్ చారి అన్నారు. శుక్రవారం పట్టణంలోని కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ జి.పోషయ్య అధ్యక్షతన ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎస్‌వీఎస్ చారి మాట్లాడుతూ విద్యార్థులు విద్యను ఇష్టంగా చదువుకోవాలని, ఎన్ని ఇబ్బందులు ఎదురైనా విద్యను నిర్లక్ష్యం చేయవద్దన్నారు. అదే విధంగా డిగ్రీ వ్యవస్థలోని సెమిస్టర్ విధానాన్ని క్రెడిట్స్ గురించి వివరించారు. విద్యార్థి లక్ష్యం, ఏకాగ్రత, పట్టుదల, క్రమశిక్షణతో చదవాలన్నారు. చదువును ఆర్థిక వస్తువుగా కాకుండా జ్ఞానార్జన మార్గంగా స్వీకరిస్తే పోటీ ప్రపంచంలో నిలబడగలమన్నారు. అదే విధంగా నాలుగు రుణాలైన పితృరుణం, గురు రుణం, దైవ రుణం, సమాజ రుణం తీర్చుకో వాల్సిన భాధ్యత ప్రతి విద్యార్థిపై ఉందన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సీహెచ్.శ్రీనివాసరావు, అకాడమిక్ కో ఆర్డినేటర్ డాక్టర్ ఎం సమత, ఐక్యూసీ కో–ఆర్డినేటర్ డాక్టర్ పి.మాలతి లత, సెక్రటరీ ఎస్. శ్రీనివాసరావు, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ బి.కవిత, డాక్టర్ కె.సంధ్య, బి. శ్వేత, పి.సుధారాణి, కె.జ్యోత్స్న, బి.కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

వారంటీ లేని గ్యారంటీ పథకాలు



ఆలయంలో పూజలు చేస్తున్న సుదర్శన్‌రెడ్డి



బైక్‌పై ర్యాలీగా వస్తున్న ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

- బీఆర్‌ఎస్ నర్సంపేట అభ్యర్థి పెద్ది

నర్సంపేట/దుగ్గొండి: కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన గ్యారంటీ పథకాలకు వారంటీ లేదని వారు అధికారంలోకి వస్తే ఢిల్లీలో రిమోట్ ఉంటుందని నర్సంపేట బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. దుగ్గొండి మండలంలోని ముద్దునూరు, గుడ్డెలుగులపల్లి, మల్లంపల్లి, చంద్రయ్యపల్లి,బొబ్బరోనిపల్లి, మర్రిపల్లి, మహ్మదాపురం, నారాయణతండా, తిమ్మంపేట, చలపర్తి, రేకంపల్లి, శివాజినగర్, తొగర్రాయి గ్రామాల్లో ఆయన శుక్రవారం ప్రచారం నిర్వహించారు. ముద్దునూరు శివరామాంజనేయస్వామి ఆలయంలో మొదట పూజలు నిర్వహించారు. అనంతరం ఆయా గ్రామాల్లో ప్రజలనుద్దేశించి మాట్లాడారు. నర్సంపేట ఎమ్మెల్యేగా తాను చేసిన పని విధానాన్ని పరిశీలించి ఓటు వేయాలన్నారు. ఇద్దరు జాతీయ నాయకులు నాపై కక్ష కట్టినా ప్రజల ఆశీర్వాదంతో ముందుకు సాగుతున్నానన్నారు. మధ్యతరగతికి చెందిన తాను నర్సంపేటను సాధ్యమైనంత వరకు అభివృద్ధి చేశానని ఇంకా చేయాల్సింది ఉందన్నారు. ముఖ్యమంత్రితో ఉన్న సాన్నిహిత్యంతో ఎక్కువ నిధులు తీసుకువచ్చానన్నారు. మరోసారి ఆశీర్వదిస్తే నమ్మకాన్ని వమ్ముచేయకుంటే పనిచేస్తానని వెల్లడించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ఆకుల శ్రీనివాస్, ఎంపీపీ కాట్ల కోమలభద్రయ్య, మండల పార్టీ అధ్యక్షుడు సుకినె రాజేశ్వర్‌రావు, తోకల నర్సింహారెడ్డి, శానబోయిన రాజ్‌కుమార్, పల్లాటి జైపాల్‌రెడ్డి, కంచరకుంట్ల శ్రీనివాసరెడ్డి, వంగేటి అశోక్‌కుమార్, శంకేసి కమలాకర్, ఊరటి మహిపాల్‌రెడ్డి, తోటకూరి రాజు పాల్గొన్నారు.

నర్సంపేటలో..

పెద్ది సుదర్శన్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని పట్టణంలోని పదవ వార్డులో కౌన్సిలర్ నాగిశెట్టి పద్మప్రసాద్, 11వ వార్డులో కౌన్సిలర్ గంప సునీత రఘునాథ్, 12వ వార్డులో వార్డు ఇన్‌చార్జ్ లెక్కల విద్యాసాగర్‌రెడ్డి, కౌన్సిలర్ ఎండి.పాషా, 20వ వార్డులో వార్డు అధ్యక్షులు రావుల ఉమారాణిసతీష్, 24వ వార్డులో నల్ల మనోహర్‌రెడ్డి, క్లస్టర్ బాధ్యుడు గుంటి కిషన్‌లు ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

సఖీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి



దుగ్గొండి : మహిళలు, బాలికలు సఖీ అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని సఖీ కేంద్రం ప్రతినిధి సుధ అన్నారు. మండలంలోని కేశవాపురం, బంధంపల్లి, లక్ష్మీపురం గ్రామాల్లో సఖీ సేవలపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో బాలికలు, మహిళలు అనేక హింసలకు గురవుతున్నారన్నారు. మహిళలు తమకు ఇబ్బందులు ఎదురైతే హెల్ప్‌లైన్ 181కి కాల్ చేస్తే వెంటనే సహాయం అందుతుందని తెలిపారు. కార్యక్రమంలో సోషల్ వర్కర్ నిర్మలాదేవి, అంగన్‌వాడీ టీచర్లు వసంత, ఉమాదేవి, విమలమ్మ పాల్గొన్నారు.

నివాళి

గూడూరు: మండలంలోని పానుగోడుకు చెందిన ప్రముఖ విద్యావేత్త, హన్మకొండ, గూడూరులో శ్రీనిధి విద్యా సంస్థల అధినేత దివంగత మోతుకూరి దేవేందర్‌రావు జయంతి వేడుకలను శుక్రవారం ఆయన కుటుంబ సభ్యులతోపాటు గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నితిన్, సర్పంచ్ భిక్షపతి, బెజ్జం రమేష్, కొండయ్య, వేణు, శ్రీను, యుగంధర్ ఉన్నారు.

మళ్లీ గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తా



ప్రచారంలో మాట్లాడుతున్న అరూరి రమేశ్



ర్యాలీగా వెళ్తున్న ప్రజలు, బీఆర్‌ఎస్ నాయకులు

- బీఆర్‌ఎస్ వర్ధన్నపేట అభ్యర్థి రమేశ్
- ప్రచారంలో భాగంగా గ్రామాల్లో అడుగడుగునా బతుకమ్మలు, మంగళహారతులతో ఘనస్వాగతం

వర్ధన్నపేట: తనను రెండు పర్యాయాలు గెలిపిస్తే వర్ధన్నపేట నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేసి చూపించానని, తిరిగి గెలిపిస్తే మరింత అభివృద్ధి చేసి చూపిస్తానని స్థానిక ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ అభ్యర్థి అరూరి రమేశ్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం మండలంలోని చెన్నారం, కాశగూడెం, కడారిగూడెం, కుమ్మరిగూడెం, రాంధన్‌తండా, చంద్రుతండా, నల్లబెల్లి, ఉప్పరపల్లి గ్రామాల్లో ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. ఆయా గ్రామాల్లో మహిళలు బతుకమ్మలు, బోనాలు నెత్తిన పెట్టుకుని మంగళహారతులతో గ్రామాల్లోకి ఆహ్వానించారు. కోలాటాలు, నృత్యాలు, డప్పులు వాయిస్తూ చేస్తూ రమేష్‌కు పూలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అరూరి రమేశ్ మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధిలో తాను వెనుకడుగు వేసేది లేదన్నారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో అంతర్గత సీసీ రోడ్లు, డ్రైనేజీలు, వీధి దీపాలు ఏర్పాటు చేసి గ్రామాలను అందంగా, పరిశుభ్రంగా తీర్చిదిద్దడం జరిగిందన్నారు. తాను ఎమ్మెల్యేగా గెలిచిన నాటి నుండి నేటి వరకు నియోజకవర్గ అభివృద్ధికి రూ.4354 కోట్లు వెచ్చించి పనులు పూర్తి చేశామన్నారు. కార్యక్రమాల్లో డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, జిల్లా రైతు బంధు కో ఆర్డినేటర్ లలిత యాదవ్, ఆత్మ జిల్లా చైర్మన్ గుజ్జ గోపాల్‌రావు, ఎంపీపీ అన్నమనేని అప్పారావు, జెడ్పీటీసీ మార్గం బిక్షపతి, పీఏసీఎస్ చైర్మన్ కొడగాని రాజేష్ ఖన్నా, మార్కెట్ కమిటీ చైర్మన్ కమ్మగోని స్వామిరాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు తూళ్ల కుమారస్వామి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

అరూరికి గౌడ సంఘం మద్దతు

హసన్‌పర్తి: నగరంలోని 65వ డివిజన్ చింతగట్టుకు చెందిన గౌడ సంఘం బీఆర్‌ఎస్ అరూరికి సంపూర్ణ మద్దతు తెలిపారు. శుక్రవారం హనుమకొండ ప్రశాంత్‌నగర్‌లో అరూరిని కలిసి మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ గుగులోతు దివ్యారాణి, మాజీ కార్పొరేటర్ రాజు నాయక్, ఆత్మ డైరెక్టర్ భూపాల్, రైతు సమితి అధ్యక్షుడు నద్దునూరి నాగరాజు, బీఆర్‌ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు సాగర్ మల్లేశం పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరికలు...

65వ డివిజన్ మునిపల్లికి చెందిన ముదిరాజ్ యూత్ అసోసియేషన్ నాయకులు బీఆర్‌ఎస్‌లోచేరారు. ఈ సందర్భంగా అరూరి వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ఘనంగా ప్రపంచ ఇమ్మ్యూనైజేషన్ డే వేడుకలు



మాట్లాడుతున్న డాక్టర్ రాజేంద్రప్రసాద్‌రెడ్డి

నర్సంపేట రూరల్ : మండలంలోని లక్నెపల్లి శివారులోని బాలాజీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మాసూటికల్ సైన్సెస్ కళాశాలలో శుక్రవారం ప్రపంచ ఇమ్మ్యూనైజేషన్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేడుకలను బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఏ.రాజేంద్రప్రసాద్‌రెడ్డి హాజరై ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రాణాలను కాపాడంలో వ్యాక్సిన్‌లకు అమిత ప్రాధాన్యత ఉందన్నారు. దీని ద్వారా అంటువ్యాధులు ప్రబలకుండా మరణాలను 25 శాతం తగ్గించవచ్చన్నారు. ప్రముఖ పిల్లల వైద్యులు డాక్టర్ పద్మజరెడ్డి మాట్లాడుతూ పిల్లలు పట్టుగానే వ్యాక్సినేషన్ (టీకాలు) చేయడం వల్ల శరీరంలో వ్యాధి నిరోధకశక్తి పెరిగి, వారికి ఎలాంటి అంటువ్యాధులు ప్రబలకుండా ఉంటాయన్నారు. వీటిని తప్పకుండా తల్లిదండ్రులు పిల్లలందరికీ క్రమం తప్పకుండా టీకాలు వేయించాలన్నారు. తద్వారా ఆరోగ్యకరమైన ప్రపంచాన్ని ఆవిష్కరించవచ్చన్నారు.కారక్యక్రమంలో కళాశాల సెక్రటరీ రాజేశ్వర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ శ్యాంసుందర్, డాక్టర్ నగేష్, మనీష్‌కుమార్, రవి, అధ్యాపకులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్, బీజేపీ నుంచి కాంగ్రెస్‌లో చేరిక



కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎర్రబెల్లి స్వర్ణ, దొంతి మాధవరెడ్డి

నర్సంపేట: నల్లబెల్లి మండలం గోవిందాపురం పంచాయతీ పరిధి గ్రామానికి చెందిన పలువురు దొంతి మాధవరెడ్డి సమక్షంలో శుక్రవారం కాంగ్రెస్‌లో చేరగా వారికి పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అలాగే పట్టణంలోని 8వ వార్డుకు చెందిన బీజేపీ నాయకుడు గడ్డం పవన్‌కుమార్, 13వ వార్డుకు చెందిన కోమండ్ల వెంకన్నజ్యోతి దంపతులతో పాటు 25 కుటుంబాలు, 24వ వార్డుకు చెందిన సామల రాంషా, దుగ్గొండి మండలం దేశాయిపల్లికి చెందిన పలువురు, నల్లబెల్లి మండలం నాగరాజుపల్లికి చెందిన పలువురు బీఆర్‌ఎస్ నేతలు కాంగ్రెస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారికి దొంతి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఐటీ దాడులు బీజేపీ, బీఆర్‌ఎస్ కుట్ర



మాట్లాడుతున్న జన్ను నర్సయ్య

పర్వతగిరి: ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఇళ్లు, కార్యాలయాలపై ఐటి అధికారులు దాడులు చేయడం వెనుక బీజేపీ, బీఆర్‌ఎస్ కుట్రలో భాగమేనని తెలంగాణ అంబేడ్కర్ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జన్ను నర్సయ్య, ఆర్‌ఎస్‌పీ జిల్లా కార్యదర్శి వల్లందాస్‌కుమార్, టీడీపీ మండల నాయకుడు కట్ట వీరభద్రయ్యలు ఆరోపించారు. మండల కేంద్రంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో అనేక మంది వ్యాపారస్తులు రాజకీయ పార్టీల్లో అసెంబ్లీ అభ్యర్థులుగా పోటీ చేస్తున్నప్పటికి వారి ఇళ్లపై, వ్యాపార సంస్థలపై ఐటీ అధికారులు దాడులు చేయకుండా కేవలం కేవలం శ్రీనివాస్‌రెడ్డి ఇంటిపై ఐటి అధికారులు దాడి చేయడం సరికాదన్నారు. పొంగులేటి ప్రభుత్వానికి బకాయిలు కట్టకపోతే గతంలోనే అధికారులు దాడులు చేయకుండా నిర్లక్ష్యం చేయడం తప్పు పడుతున్నామన్నారు. ఏ పార్టీ వారైన వారి ఇళ్లు, కార్యాలయాలపై ఐటి అధికారులు ఎన్నికలు పూర్తయ్యేంత వరకు దాడులు నిలిపివేయాలని కోరారు.

విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంచాలి



మాట్లాడుతున్న ఎంఈఓ రత్నమాల

చెన్నారావుపేట: పదో తరగతి విద్యార్థుల ఉత్తీర్ణత శాతాన్ని పెంచాలని ఎంఈఓ రత్నమాల అన్నారు. స్థానిక హైస్కూల్‌లో శుక్రవారం ప్రైమరీ లెవల్, ఫిజికల్ సైన్స్ స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధ్యాయులు తప్పకుండా కాంప్లెక్స్ సమావేశాలకు హాజరుకావాలన్నారు. వెనుకబడిన వి ద్యార్థులపై ప్రత్యేక చొరవ చూపాలని సూచించారు. ప్రత్యేక తరగతులకు విద్యార్థులు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం రిసోర్స్ పర్సన్‌లు బాలాజీరావు, జోగయ్య, సుధాకర్‌రెడ్డి, అజాంలు టీచింగ్ ప్లాన్, టీఎల్ ఎం రేమిడియల్ టీచింగ్, పీరియడ్ ప్లాన్స్, మోడల్ లెస్సన్స్, అభ్యాసన సామర్థ్యంపై వివరించారు. సమావేశంలో కాంప్లెక్స్ హెచ్‌ఎంలు పాపమ్మ, అసిస్టెంట్ సెక్రటరీ మోతె ఇంద్రసేనారెడ్డి, ఉపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, శ్రావణ్‌కుమార్, సురేందర్, విజేందర్, మాధవి, సీఆర్‌పీలు సంపత్, స్వామి పాల్గొన్నారు.

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పలు పార్టీలతో పాటు స్వతంత్ర అభ్యర్థులు భారీగా నామినేషన్‌లు దాఖలు చేశారు. చివరి రోజులో భాగంగా పరకాల, పాలకుర్తి, నర్సంపేట, వర్ధన్నపేటల నుంచి పలు నామినేషన్లు దాఖలయ్యాయి. ప్రధాన అభ్యర్థులతో పాటు పలువురు స్వతంత్ర అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకోవడానికి నామినేషన్లను రిటర్నింగ్ అధికారి కృష్ణవేణికి అందజేశారు. - సాక్షి నెట్‌వర్క్



వర్ధన్నపేట : కాంగ్రెస్ రెబల్ అభ్యర్థి సిరిసిల్ల రాజయ్య తరపున నామినేషన్ వేస్తున్న ప్రొఫెసర్ వేణుగోపాల్



నర్సంపేట : నామినేషన్ దాఖలు చేస్తున్న బీఎస్పీ అభ్యర్థి మదన్‌కుమార్



నర్సంపేట : నామినేషన్ దాఖలు చేస్తున్న స్వతంత్ర అభ్యర్థి ఇమ్మడి బాబు



పరకాల : నామినేషన్ వేస్తున్న బీజేపీ అభ్యర్థి కాళీప్రసాద్‌రావు



నర్సంపేట : ఇండిపెండెంట్ అభ్యర్థి యువరాజు



నర్సంపేట : ఇండిపెండెంట్ అభ్యర్థి రమేష్



నర్సంపేట : భారత్ చైతన్య యువజన పార్టీ అభ్యర్థి ఉంద్రాతి వీరస్వామి



పాలకుర్తి : నామినేషన్ వేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి యశస్వినిరెడ్డి



పాలకుర్తి : నామినేషన్ వేస్తున్న బీఎస్పీ అభ్యర్థి వెంకటస్వామి

'గెలిపించండి అభివృద్ధికి కృషి చేస్తాం'

సాక్షి నెట్‌వర్క్ : నియోజకవర్గాలోని ప్రజలు ఈసారి జరిగే ఎన్నికల్లో ఓటు వేసి గెలిపిస్తే అభివృద్ధికి కృషి చేస్తామని కాంగ్రెస్, బీజేపి అభ్యర్థులు తెలిపారు. నర్సంపేట, వర్ధన్నపేట, పరకాల నియోజకవర్గాల్లోని ప్రధాన అభ్యర్థులైన దొంతి మాధవరెడ్డి, కేఆర్ నాగరాజు, కొండేటి శ్రీధర్, చల్లా ధర్మారెడ్డి, రేవూరి ప్రకాష్‌రెడ్డి, పి.కాళీ ప్రసాద్‌రావుతో పాటు స్వతంత్ర్య అభ్యర్థులు శుక్రవారం ఊరూరా తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ ప్రచారం చేపడుతూ ఓటర్లను కలిసి ఓటు వేయాలని అభ్యర్థించారు. మండలాల్లోని ఆయా గ్రామాల్లో ప్రచారానికి ప్రధాన అభ్యర్థులు వెళ్తుండగా ప్రజలు బతుకమ్మ, మంగళహారతులు, నుదుట తిలకం పెట్టి స్వాగతం పలుకుతున్నారు. మేనిఫెస్టోలో పొందుపర్చిన అంశాలను పరిగణలోకి తీసుకుని ప్రచారంలో ఓటర్లకు వివరిస్తున్నారు. ప్రతి రోజు ఉదయం నుంచి మొదలు కొని రాత్రి వరకు తమ ప్రచారాలను ముమ్మరంగా కొనసాగిస్తున్నారు. తమకు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించి ఆశీర్వదించాలని అభ్యర్థులు కోరుతున్నారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీపీలు, జెడ్పీటీసీలు, పీఏసీఎస్, మార్కెట్ కమిటీ చైర్మన్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ముఖ్యనాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నగదు పట్టివేత



తనిఖీల్లో నగదు పట్టుకున్న ఎస్సై దేవేందర్

శాయంపేట : ఈ నెల 30వ తేదీన జరగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పరకాల, హనుమకొండ ప్రధాన రహదారి కొత్తగట్టుసింగారం వద్ద ఎస్సై దేవేందర్ శుక్రవారం వాహన తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో వరంగల్ పట్టణానికి చెందిన భూపతి సుధాకర్ కారులో లక్ష రూపాయలు తీసుకొని హనుమకొండ నుంచి పరకాలకు వెళ్తున్నాడు. పోలీసులు వాహనాన్ని తనిఖీ చేయగా ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా ఆధారాలు లేకుండా లక్ష రూపాయలు తీసుకొని వెళ్తున్న కారణంగా సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు. ఈ డబ్బులను భూపాలపల్లి రిటర్నింగ్ అధికారికి అప్పగించినట్లు ఎస్సై పేర్కొన్నారు.